లైసెన్సులు లేకుండానే వ్యాపారాలు

- ఇందూరులో 5,570 ట్రేడ్స్
- వేయి దుకాణాలకు మాత్రమే లైసెన్సులు
- కొత్త లైసెన్సుల కోసం అరకొర దరఖాస్తులు
- లైసెన్సులేని దుకాణాలపై చర్యలకు అధికారుల కసరత్తు



బల్దియా కార్యాలయం

నిజామాబాద్ సిటీ : ఇందూరులో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వారు బల్దియా నుంచి అనుమతులు తీసుకోవడానికి ఆసక్తి చూపడం లేదు. లైసెన్సులు లేకుండానే దర్జాగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ట్రేడ్ లైసెన్సులు తీసుకోవాలని సిబ్బంది సూచించినా ఖాతరు చేయడం లేదు. నగరంలో వ్యాపారాలు చేసేవారి జాబితాను బల్దియా అధికారులు సిద్ధం చేశారు. అనుమతిలేని దుకాణాలపై చర్యలకు సిద్ధమవుతున్నారు.

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మొత్తం 5570 దుకాణాలు నిర్వహిస్తున్నట్లు బల్దియా అధికారులు లెక్కలు తేల్చారు. గూగుల్ మ్యాప్, భువన్ యాప్ ఆధారంగా ట్రేడ్ నిర్వహిస్తున్న వారిని గుర్తించారు. ఇందులో కేవలం వేయి దుకాణాలకు మాత్రమే బల్దియా నుంచి అనుమతి తీసుకొని లైసెన్సు ఫీజును చెల్లించి వ్యాపారాలు చేస్తున్నారు. మిగతా 4,570 మంది మాత్రం మున్సిపల్ నుంచి ఎలాంటి లైసెన్సులు తీసుకోలేదు. కనీసం దరఖాస్తు కూడా చేసుకోలేదు.

10 రోజుల్లోనే అనుమతి..

ట్రేడ్ లైసెన్సుల కోసం కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలి. చెల్లించిన పన్నుల రశీదులు, సరియైన పత్రాలు సమర్పించాలి. బల్దియా సిబ్బంది క్షేత్రస్థాయిలో పరిశీలించి రిపోర్టు ఇస్తారు. వివరాలు సరిచూసి దరఖాస్తు చేసుకున్న 10 రోజుల్లోనే ట్రేడ్ లైసెన్సును జారీచేస్తాం.

జరిమానాలు, సీజ్‌లు..

అనుమతి లేకుండా వ్యాపారాలు నిర్వహించేవారు వెంటనే ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవాలి. చెప్పినా వినకుంటే వారికి భారీ జరిమానాలతో పాటు దుకాణాలు సీజ్ చేసే అధికారం మున్సిపల్ అధికారులకు ఉంటుంది. బల్దియాకు పన్నులు చెల్లించి సహకరించాలని రెవెన్యూ అధికారులు సూచిస్తున్నారు.

ట్రేడ్ లైసెన్సు తీసుకోవడం ఇలా..

- వ్యాపారం ప్రారంభించడానికి ముందుగానే మున్సిపల్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలి.
- వ్యాపారానికి సంబంధించి అనుమతి పొందాలి.
- సంబంధిత వ్యక్తి ఆధార్ కార్డు సమర్పించాలి
- పన్నులు పూర్తిగా చెల్లించిన రశీదు జతచేయాలి
- వ్యాపారం నిర్వహించే స్థలం (బిల్డింగ్) ఫోటో జతచేయాలి.
- వ్యాపారానికి సంబంధించిన ఆఫీసు కొలతలు సమర్పించాలి.
- రోడ్డుకు 1000 స్క్వేర్ ఫీట్ లోపల నిర్వహిస్తే రూ. 2/-
- 20 స్క్వేర్ ఫీట్ లోపల నిర్వహిస్తే రూ. 3/-
- 20 నుంచి 30 స్క్వేర్ ఫీట్ లోపల నిర్వహిస్తే రూ. 5/- చొప్పున రుసుం నిర్ణయిస్తారు.
- ఒకవేళ అనుమతి లేకుండా వ్యాపారం ప్రారంభిస్తే 90 రోజుల లోపు అయితే 25శాతం పైన్‌తో రుసుం చెల్లించవచ్చు. 90 రోజులు దాటితే 50 శాతం ఫైన్ చెల్లించాల్సి ఉంటుంది.
- కమర్షియల్ భవనాలకు ఫైర్‌సేఫ్టీ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి.
- ఈ అనుమతి 11 నెలలకు వర్తిస్తుంది. అనంతరం రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది.
- సకాలంలో రెన్యూవల్ చేసుకోకపోతే అసలు పన్నుతోపాటు 25 రెట్లు అధికంగా పన్ను చెల్లించాల్సి ఉంటుంది.

లైసెన్సు పొంది వ్యాపారాలు చేయాలి



మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చిన్నపాటి వ్యాపారం నుంచి పెద్ద స్థాయి వ్యాపారం వరకు మున్సిపల్ అనుమతి తప్పనిసరి. వ్యాపారానికి బల్దియా నుంచి ట్రేడ్ లైసెన్సు తప్పనిసరి. అనుమతి లేకుండా వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటాం. అవసరమైతే దుకాణాలు సీజ్ చేస్తాం. ప్రతి ఒక్కరు అనుమతి తీసుకునే వ్యాపారాలు చేయాలి. లైసెన్సు లేని వ్యాపారులు బల్దియాలో దరఖాస్తు చేసుకోవాలి.

– ఎం.రవిబాబు, డిప్యూటీ కమిషనర్

ఎరువుల స్టాక్ వివరాలు ప్రదర్శించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- బోర్గాం(పి)లో ఎరువుల గోడౌన్ పరిశీలన


బోర్గాం సొసైటీ గోదాములో ఎరువుల నిల్వలు పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): జిల్లాలో అన్ని సహకార సంఘాల గోడౌన్లలో ఎరువుల స్టాక్ వివరాలు బోర్డులో ప్రదర్శించాలని కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. సోమవారం బోర్గాం(పి)లోని సహకార సంఘం ఎరువుల గోడౌన్‌ను ఆయన సందర్శించి ఎరువుల స్టాక్ పరిశీలించారు. ఎరువుల కొరత ఉందా అని నిర్వాహకులను ప్రశ్నించగా, రైతుల అవసరాలకు సరిపడా యూరియా, ఎరువులు అందుబాటులో ఉన్నాయని, ఇప్పటివరకు ఎలాంటి కొరత ఏర్పడలేదని వివరించారు. అంతకుముందు ఆయుష్మాన్ భారత్ – హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్, శాఖ గ్రంథాలయాన్ని పరిశీలించారు. పల్లె దవాఖానాను సందర్శించిన కలెక్టర్ సిబ్బంది హాజరును అడిగి తెలుసుకున్నారు. ప్రజలు, రోగులకు అందిస్తున్న సేవలు, రికార్డులను తనిఖీ చేశారు. డెంగీ, మలేరియా, విష జ్వరాలు వంటివి ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ సెంటర్‌కు నూతన భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం శాఖ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. పాఠకులకు అనువుగా ఉండేలా లైబ్రరీని మరో భవనంలోకి మార్చాలని గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుగ్గారెడ్డిని ఆదేశించారు. లైబ్రరీలో సమయ పాలన విధిగా పాటించాలని, అన్ని రకాల పత్రికలు, పుస్తకాలు అందుబాటులో ఉంచాలని సూచించారు.

మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవిబాబుపై చర్యలు తీసుకోవాలి


ఫిర్యాదు చేస్తున్న బీఎల్‌టీయూ నాయకులు

నిజామాబాద్ సిటీ : రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ ఎం.రవిబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, మున్సిపల్ వర్కర్స్ అండ్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు దండి వెంకట్ కోరారు. సోమవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదుచేశారు. ఈ సందర్భంగా దండి వెంకట్ మాట్లాడుతూ.. మున్సిపల్ కార్పొరేషన్‌లో విధులు నిర్వహిస్తున్న అవుట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల గురించి చర్చించేందుకు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్, ఇన్‌చార్జి ఎంహెచ్‌వో రవిబాబును కలిశామని తెలిపారు. ఈ సందర్భంగా రాజ్యాంగం ద్వారా కార్మికులకున్న హక్కుల గురించి మాట్లాడుతుంటే అసభ్యంగా అవమానించాడని ఫిర్యాదుచేశారు. వెంటనే కమిషనర్ దిలీప్‌కుమార్‌కు కూడా ఫిర్యాదుచేసినట్లు తెలిపారు. అంబేడ్కర్ గురించి అనుచితంగా మాట్లాడిన డిప్యూటీ కమిషనర్ రవిబాబుపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. యూనియన్‌నాయకులు మేకల రాజేందర్, సబ్బని లత తదితరులున్నారు.

క్లుప్తంగా

ఆశావర్కర్లకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నిజామాబాద్ సిటీ : వైద్య ఆరోగ్య శాఖలో విధులు నిర్వహిస్తున్న ఆశా వర్కర్లకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ కోరారు. ఈమేరకు సోమవారం డీఎంహెచ్‌వో రాజశ్రీకి వినతి పత్రం సమర్పించారు. అనంతరం నూర్జహాన మాట్లాడుతూ ఆశావర్కర్లకు జూలై నెల వేతనం ఇప్పటికీ రాలేదన్నారు. వారికి కనీస వేతనం రూ. 18 వేలు అమలుచేసి, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే ఆందోళనలకు సిద్ధమవుతామని పేర్కొన్నారు. రేణుక, సుకన్య, అనిఫా,సంగీత పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలని వినతి



నిజామాబాద్ సిటీ : జిల్లా కేంద్రంలోని 3వ డివిజన్ పరిధిలోని ముబారక్‌నగర్‌లోని మహాలక్ష్మినగర్‌లో సమస్యలు పరిష్కరించాలని సాయిటవర్స్ వాసులు కమిషనర్ దిలీప్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. సోమవారం కమిషనర్ చాంబర్‌లో కాలనీవాసులు కమిషనర్ దిలీప్‌కుమార్‌తో సమస్యలు మొరపెట్టుకున్నారు. కాలనీలో సరియైన రోడ్లులేదని, డ్రైయినేజీలు శుభ్రం చేయడంలేదన్నారు. మంచి నీటి సమస్య తీవ్రంగా ఉందన్నారు. వీధి లైట్లులేకపోవడంతో రాత్రివేళలో బయటకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందని తెలిపారు.సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. సాయి టవర్స్ వెల్ఫేర్ సభ్యులు మహేష్ , బాల్‌రావు, బాలకుమార్‌లున్నారు.

మాల అమరవీరులకు నివాళులు



నిజామాబాద్‌నాగారం: నగరంలోని పాత అంబేద్కర్ భవనంలో నిజామాబాద్ మాల మహానాడు అధ్యక్షులు చొక్కం దేవిదాస్ ఆధ్వర్యంలో సోమవారం మాల అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు.ఈసందర్భంగా నాయకులు అమర వీరులకు ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు చొక్కం దేవిదాస్ మాట్లాడుతూ 1997 ఆగస్టు 11న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట ఉద్యమంలో పానంగి శేషయ్య, గోపతోటి నారాయణలు తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నాంది వినయ్ కుమార్, కోశాధికారి జి. రాజన్న ఉపాధ్యక్షులు బొడ్డు లక్ష్మణ్, భూమయ్య టీం కన్వీనర్ సక్కి ఉదయ్ కుమార్ మాక్లూర్ మండల్ అధ్యక్షులు బేగరి రవికుమార్ పాల్గొన్నారు.

ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.3 కోట్లు

మోర్తాడ్: బాల్కొండ నియోజకవర్గంలోని వివిధ గ్రామాలలో అభివృద్ధి పనుల కోసం నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్ రూ.3 కోట్ల నిధులను ఎంపీ ల్యాడ్స్ నుంచి మంజూరు చేశారని భీమ్‌గల్ మండల బీజేపీ అధ్యక్షుడు ఆరె రవీందర్ తెలిపారు. మండలంలోని ముచ్కూర్ రామాలయం వద్ద కమ్యూనిటీ హాల్ కోసం రూ.4 లక్షలు, రహత్‌నగర్‌లో బస్ షెల్టర్ కోసం రూ.4 లక్షలను కేటాయించారని తెలిపారు. సోమవారం భీమ్‌గల్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. నిధుల మంజూరుకు సహకరించిన పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జి డాక్టర్ మల్లికార్జున్‌రెడ్డికి, ఎంపీ అర్వింద్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	101,400	వెండి(కిలో)	1,21,000
22 క్యారెట్స్	93,395	– నిజామాబాద్ బిజినెస్	

మాంసం ధరలు

చికెన్	ధరలు	డ్రెస్స్‌డ్	140
	(కిలోకు)	లైవ్	120
స్కిన్‌లెస్	180	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	20	40	గాజరుగడ్డ	30	60
బెండకాయ	30	60	పచ్చిమిర్చి	40	80
బీరకాయ	20	40	దోసకాయ	10	20
దొండకాయ	30	60	ఆలుగడ్డ	20	40
బీర్నీసుకాయ	70	120	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	60	గోబిపువ్వు	30	60
వంకాయ	20	40	బీట్‌రూట్	30	60
పాలకూర	30	60	కరివేపాకు	40	80
మెంతికూర	40	80	చామగడ్డ	30	60
కొత్తిమీర	30	60	చిక్కుడుకాయ	30	60
పుదీనా	40	80	గోరుచిక్కుడు	40	80
క్యాప్సికం	30	60			

–సుభాష్‌నగర్

ప్రజా సేవచేయడానికి రాజకీయాల్లోకి వచ్చా

- బీసీ రిజర్వేషన్లకు బీజేపీ, బీఆర్ఎస్ అడ్డు
- రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి


నల్లవెల్లిలో సొసైటీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ఇందల్వాయి: ప్రజాసేవ చేయడానికే డాక్టర్ వృత్తిని వదిలి రాజకీయాల్లోకి వచ్చానని మీ ఆశీర్వాదంతోనే ఎమ్మెల్యే గా గెలిచానని రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి అన్నారు. మండలంలోని నల్లవెల్లి గ్రామంలో రూ.3 కోట్లతో చెక్ డ్యాం, రూ.65 లక్షలతో సొసైటీ నూతన భవనాన్ని ఆయన సోమవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతూ నల్ల వెల్లి గ్రామాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం లక్షల కోట్లు అప్పు చేసి, అభివృద్ధి చేయలేదని విమర్శించారు.కేసీఆర్ కుటుంబమంతా అవినీతి పరులేనని, కాళేశ్వరం కూలేశ్వరం అయ్యిందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 18 నెలల్లోనే ఇచ్చిన హామీలను అమలు చేశామన్నారు. 40 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేసిన ఘనత సీఎం రేవంత్ రెడ్డిదేనన్నారు. నల్లవెల్లి గ్రామంలో 26 మందికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, ఇంకో 50 ఇళ్ల వరకు మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా భవనాన్ని మంజూరు చేస్తానన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు బీఆర్ఎస్, బీజేపీలు అడ్డుపడుతున్నాయన్నారు.అనంతరం గ్రామస్తులు, మహిళలు ఎమ్మెల్యే భూపతిరెడ్డి శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీబీ చైర్మన్ రమేష్ రెడ్డి, సొసైటీ చైర్మన్ నోముల శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ రాజు, వెంకట రెడ్డి, ఇమ్మడి గోపి, దామ సుమన్, గుండ్ల శ్రీనివాస్, ఎంపీ గంగన్న, తహసీల్దార్ వెంకట్రావ్, ఎంపీడీవో అనంత రావు, ట్రాన్స్‌కో ఏఈ జ్ఞానేశ్వర్, వ్యవసాయ అధికారి ప్రవీణ్, కాంగ్రెస్ నేతలు, గ్రామస్తులు, మహిళలు, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు ఆర్థిక భరోసా


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధన్‌పాల్

- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్
- 121 మంది బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేత

సుభాష్‌నగర్: సీఎం సహాయనిధి పేదలకు ఆర్థిక భరోసాగా నిలుస్తుందని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 121 మంది బాధిత కుటుంబాలకు రూ.35.62లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు. ఈసందర్భంగా ధన్‌పాల్ సూర్యనారాయణ మాట్లాడుతూ బాధితులు దరఖాస్తు చేసుకున్న మొత్తంలో కేవలం 20శాతం వరకు మాత్రమే ప్రభుత్వం చెల్లిస్తుందని, కనీసం 50శాతానికిపైగా చెల్లించేలా సీఎం దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. నియోజకవర్గంలో ఆర్థికంగా ఇబ్బంది పడుతూ వైద్యం పొందలేని బాధితులను సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆదుకోవడం బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు, మాజీ కార్పొరేటర్లు న్యాలం రాజు, నాగోళ్ల లక్ష్మీనారాయణ, మల్లేష్ యాదవ్, మాస్టర్ శంకర్, నాగరాజు, తారక్ వేణు, పల్నాటి కార్తీక్, హరీష్‌రెడ్డి, ఇప్పకాయల కిషోర్, నిచ్చెంగ్ కృష్ణ, మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వర్షాల కోసం జలాభిషేకం


జలాభిషేకం చేస్తున్న గ్రామస్తులు

సిరికొండ: వర్షాలు కురవాలని కోరుతు మండల కేంద్రంలో గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో లొంక రామలింగేశ్వరాలయం శివలింగానికి, హనుమాన్ ఆలయంలో, గ్రామ దేవతలకు జలాభిషేకాలు సోమవారం నిర్వహించారు. గోదావరి నుంచి గంగా జలాలను తీసుకొచ్చి డప్పు వాయిద్యాలతో ఊరేగింపు చేస్తు గ్రామ దేవతలకు జలాభిషేకం చేశారు. వర్షాలు బాగా కురిపించాలని దేవతలకు పూజలు చేశారు. లొంక రామలింగేశ్వరస్వామి ఆలయంలో వర్షాలు కురిపించాలని కోరుతు వరుణ యాగం నిర్వహించారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. వీడీసీ చైర్మన్ స్వామి, భూమారెడ్డి, మంగళి మోహన్, కమ్మరి గంగాధర్, కుమ్మరి లచ్చన్న, చాకలి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ


సిరికొండ మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు వేస్తున్న తుకారాంరాథోడ్


శంకర్‌భవన్ పాఠశాల విద్యార్థులకు మాత్రలు వేస్తున్న టీచర్లు

సిరికొండ/నిజామాబాద్ అర్బన్/జక్రాన్‌పల్లి/ధర్పల్లి : ప్రతి ఒక్కరు తమ చేతులను పరిశుభ్రంగా కడుక్కోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో, జిల్లా మలేరియా అధికారి తుకారాంరాథోడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో పీఎంశ్రీ తెలంగాణ ప్రభుత్వ ఆదర్శ పాఠశాల/కళాశాలలో జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విద్యార్థులకు ఆయన ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. నగరంలోని కోటగల్లిలోగల జీపీఎస్ శంకర్‌భవన్ పాఠశాలలో హెల్త్ సూపర్‌వైజర్లు శాంత కుమారి నటరాజ్ గౌడ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. జక్రాన్‌పల్లి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వేశారు. ఈకార్యక్రమానికి తహసీల్దార్ కిరణ్మయి ప్రారంభించారు. ధర్పల్లి మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలను వైద్యాధికారులు అందజేశారు.ఈకార్యక్రమంలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలను పూడ్చిన పోలీసులు


గుంతలను పూడ్చివేయించిన పోలీసులు

డిచ్‌పల్లి: రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా డిచ్‌పల్లి –నిజామాబాద్ ప్రధాన రోడ్డుపై నడిపల్లి గ్రామం వరకు ఏర్పడిన ప్రమాదకర గుంతలను సోమవారం సర్కిల్ ఇన్స్‌పెక్టర్ కే.వినోద్ గ్రామస్తుల సహకారంతో పూడ్చి వేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు డిచ్‌పల్లి స్టేషన్ నుంచి నడిపల్లి వరకు పలు చోట్ల ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయి. ఈ గుంతలతో పలువురు ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురయ్యారు. దీంతో డిచ్‌పల్లి సీఐ వినోద్ ఆదేశాల మేరకు నడిపల్లి గ్రామ పోలీస్ కానిస్టేబుళ్లు శ్రీనివాస్, అరుణ్ లు నడిపల్లి గ్రామస్తులతో మాట్లాడారు. సీఐ పర్యవేక్షణలో గ్రామస్తుల సహకారంతో రోడ్డుకు ఇరువైపులా ఏర్పడిన ప్రమాదకర గుంతలను పూడ్చి వేశారు. గుంతలను పూడ్చి వేసిన పోలీసులను స్థానికులు, వాహనదారులు ప్రత్యేకంగా అభినందిస్తున్నారు.

ఆయిల్‌పాం సాగుపై రైతులు ఆసక్తి చూపాలి


అవగాహన కల్పిస్తున్న ఏవో దేవిక

జక్రాన్‌పల్లి: ఆయిల్‌పాం సాగుపై రైతులు ఆసక్తి చూపాలని మండల వ్యవసాయ అధికారిని దేవిక సూచించారు. సోమవారం జక్రాన్‌పల్లి రైతు వేదికలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ప్రభుత్వం పలు రకాల సబ్సిడీ అందిస్తూ ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తుందన్నారు. ఈ పంటను ఒకసారి నాటితే 4 సంవత్సరాల అనంతరం నిరంతర ఆదాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఆయిల్‌పాం సాగు చేస్తున్న రైతులకు చిన్న, సన్నకారు, ఐదెకరాల లోపు ఉన్నవారికి 90 శాతం రాయితీ,ఎస్సీ ,ఎస్టీ రైతులైతే 100 శాతం రాయితీ, 5 ఎకరాల పైన సాగు చేసే రైతులు 80 శాతం రాయితీ కింద డ్రిప్ సౌకర్యం పొందవచ్చని తెలిపారు. హార్టికల్చర్ అధికారి రాజు, ఏఈవో శివ ప్రసాద్, ప్రీయూనిక్ కంపెనీ క్లస్టర్ ప్రతినిధి రాకేష్, గ్రామ మాజీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలి

నిజామాబాద్ రూరల్: జూన్ 5వ తేదీ వరకు పట్టాపాసు పుస్తకం వచ్చిన రైతులు రైతు బీమాకు దరఖాస్తు చేసుకోవాలని రూరల్ మండల వ్యవసాయాధికారిణి జాదవ్ హిరా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈఅవకాశం ఆగస్టు 12 వరకు ఉందని, రైతుబీమా పథకంలో నామినీ పేరు మార్చుకోవడానికి ఈనెల 13లోపు అవకాశం ఉందని పేర్కొన్నారు. క్లస్టర్ పరిధిలో రైతులు రైతువేదికల్లో ఏఈవోలను సంప్రదించాలన్నారు.

ఆత్మీయ భరోసాను అమలు చేయాలి

సిరికొండ: భూమి లేని పేదలకు ఇందిరా ఆత్మీయ భరోసాను వెంటనే అమలు చేయాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ డిమాండ్ చేశారు. మండలంలోని రావుట్ల గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శికి వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బాబన్న, కార్యదర్శి దామోదర్, రాజేందర్, చిన్న రాజన్న, మోతీలాల్, గంగు, జమున, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

బంజారా భాషకు చట్టబద్ధత కల్పించాలి

నిజామాబాద్ రూరల్: బంజారా భాషకు చట్టబద్ధత కల్పించాలని తెలంగాణ రచయితల వేదిక జిల్లా అధ్యక్షులు ప్రేమ్‌లాల్ డిమాండ్ చేశారు. నగరంలోని సంఘ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో సోమవారం ఆయన మాట్లాడారు. సమావేశంలో వేముల శేఖర్, ప్రకాష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

క్రీడా దుస్తుల వితరణ



జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులకు వీపీ ఉన్నితన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆనందవల్లి (కేరళ) యూఎస్ఏ ఎన్ఆర్ఐ సహకారంతో 100 మంది విద్యార్థులకు కీడా దుస్తులను వితరణగా అందజేసినట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ మర్కంటి గంగామోహన్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జక్రాన్‌పల్లి మండల విద్యాధికారి మూడేడ్ల శ్రీనివాస్ మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ గంగా జమున, గ్రామ అభివృద్ధి కమిటీ ఉపాధ్యక్షుడు స్వామి, పాఠశాల ఉపాధ్యాయ బృందం సాయిలు, రామకృష్ణ, గంగాధర్, డా నరసింహారావు, సునీత, కృష్ణ, పల్లె గంగాధర్, గౌతమి, ఓఎస్ శేఖర్ , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగుల పంపిణీ



నిజామాబాద్ నాగారం: లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ ఆధ్వర్యంలో డిచ్‌పల్లి 7వ బెటాలియన్ 1995 బ్యాచ్ కానిస్టేబుళ్ల సహకారంతో సోమవారం నగరంలోని గుర్బాబాది ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులు పంపిణీ చేశారు. లయన్స్ జిల్లా చైర్మన్ విజయానంద్ మాట్లాడుతూ విద్యార్థులు చిన్నతనం నుంచే క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు.డిచ్‌పల్లి ఏడవ పోలీసు బెటాలియన్ 1995 బ్యాచ్ కానిస్టేబుళ్ల సేవా కార్యక్రమాలు చేపడుతుండడంఅభినందనీయమన్నారు.కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ ఇందూర్ అధ్యక్ష కార్యదర్శులు అబ్బాయి లింబాద్రి ,పి.రాఘవేందర్, డిచ్‌పల్లి ఏడవ బెటాలియన్ 1995 బ్యాచ్ కానిస్టేబుళ్ల , గుత్పే కిరణ్, కైలాస్ పవర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు చిన్నయ్య స్వామి ,ఉపాధ్యాయురాలు శ్రీవాణి, లయన్స్ ప్రతినిధులు లావణ్య, జిల్కర్ నయన్ పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడికి పరామర్శ



సిరికొండ: మండలంలోని తూంపల్లి గ్రామంలో యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు ఏశాల మహేందర్‌ను పీసీసీ డెలిగేట్ శేఖర్‌గౌడ్,డీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్కోల్ భాస్కర్‌రెడ్డిలు సోమవారం పరామర్శించారు.మహేందర్ అన్న రాజు ఆదివారం అనారోగ్యంతో మృతి చెందగా సోమవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రాజు మృతదేహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ మండలాధ్యక్షుడు బకారం రవి, పలువురు నాయకులు పాల్గొన్నారు.